B.Badri Reddy
Head master
A.R. High School
AdinaryanaPuram
Chirala

# టీచర్ ఎ నేషన్ బిల్డర్

ఒక నేషన్ గొప్పదిగా పరిగణింపబడుతుంది అంటే... ఆదేశములో గల బంగారం, సంపదవల్లనా, లేక ఆదేశపు అందమైన భవనాల వల్లనా? అని ఆలోచిస్తే.... ఆదేశ పౌరుల వలన అని అర్థమౌతుంది. కారణం సంపదలు శాశ్వతంకాదు. ఆ దేశ ప్రజలే శాశ్వతం. ఆ ప్రజల ఆచార విచారాలు, వారి అలవాట్లు, వారి కృషి, వారి జీవన విధానము, వారి సంస్కృతి, ఒక జాతిని, వారు నివసించు దేశాన్ని గొప్పదిగా చేయగలదు.

అట్టి గొప్పజాతిని, దేశాన్ని తయారు చేయగలవారు ఎవరు? అని ప్రశ్నించుకుంటే.. ఆదేశంలో గల గురువులు (టీచర్లు) అని జవాబు చెప్పక తప్పదు. కారణం తన వద్దకు వచ్చే విద్యార్థిని ఉపాధ్యాయుడు, వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సామాజికంగా, రాజకీయంగా తను కోరుకున్న విధంగా ప్రభావితం చేయగలడు. మారుచున్న పరిస్థితలను ఎదుర్కొనే విధంగా మలచగలడు. సమాజానికి అవసరమైన వివిధ వృత్తుల వారిని తయారు చేసి సమాజానికి అందించ గలడు. జ్ఞాన సంపన్నులను చేయగలడు. అందుచేతనే ఒక టీచర్‌ను నేషనల్ బిల్డర్ అన వచ్చును. నేషన్ అనేది ఒక హర్మ్యమైతే దాని పునాదులను లోతుగా, బలంగా వేయగలవాడు, ఆ కట్టడాన్ని ఆకాశహర్మ్యంగా మలచగలవాడు – ఒక టీచరే. భవనానికి వివిధ స్తంభాలు ఆధారంగా ఉంటే, సమాజమనే భవనానికి వివిధ వృత్తులనే స్తంభాలు ఆధారంగా ఉంటాయి. ఆ వృత్తులలో శిక్షణ నిచ్చి, మంచి కౌశలం గల వారిని తయారు చేసి సమాజ మనుగడకు సహాయపడగలవాడు, సమాజాన్ని ప్రగతి పథాన నడపగలవాడు; సమాజాన్ని నిర్మింపగలవాడు ఉపాధ్యాయుడే. ఒక సమాజం ఆ దేశములోగల విద్యావిధానంపై ఆధారపడి యుంటుంది. ఉపాధ్యాయులు విద్యావిధానానికి వెన్నుపూసలు. వారు ఆ దేశానికి, అక్కడి ప్రజలకు ఆధారభూతులు.

టీచర్ తన వద్ద విద్యనభ్యసించే విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాడు. పిల్లలతో స్నేహంగా ఉంటూ, వారిలో స్నేహతత్వాన్ని ఇనుమడింపచేస్తాడు. ఏది తప్పో ఏది ఒప్పో చెప్పి వారి తప్పులను సరిదిద్దుతాడు. విద్యను విజ్ఞానాన్ని పంచి వారి జీవితాలకు రాచబాటలు వేస్తాడు. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ అంశాలను అర్థం చేసుకునే విధంగా వారికి తర్ఫీదు నిస్తాడు. తాను వారి బాగోగులు చూస్తూ, వారి జీవనం సుఖమయం కావడానికి మార్గదర్శకుడౌతాడు. మనిషిని, మనీషిగా మారుస్తాడు. భారతంలో యక్షప్రశ్నలలో “మనిషి మనీషి ఎలా అవుతాడు” అని యక్షుడు అడుగగా, ధర్మరాజు “అధ్యయనం వల్ల, గురువు బోధనవల్ల” అని జవాబిస్తాడు. గురువు బోధనలు ప్రభావితం చేయగలవు అని మనం అర్థం చేసుకోవాలి.

ఒక యంత్ర పరిశ్రమలో ఒకే రకమగు వస్తువులు తయారవుతాయి. కానీ గురువనే సజీవ యంత్రం సమాజానికి కావలసిన వివిధ రకాల వృత్తికారులను, అవసరమైన వివిధ యంత్రాలను సైతము తయారు చేసి దేశ నిర్మాణంలో సహాయకారియౌతాడు.

చదువులెల్ల నేర్వ సంస్కారమలవడి
గుణములెల్ల వచ్చి గుబుతు పెరుగు
పూలు పరిమళించు పుష్పసౌరభమట్లు
మల్లినేనిమాట మణులమూట.

చదువు వల్ల సంస్కారం రావాలి. మనిషి ప్రయోజకుడు కావాలి. కానీ నేడు నైతిక విలువలు పతనమౌతున్నాయని పలువురు భావిస్తున్నారు. “భవిష్యత్తులో మానవజాతి నశించిపోవడమంటూ జరిగితే, అణుబాంబుల వల్లనో, అంటురోగాల వల్లనో కాదు. నైతిక విలువల పతనం వల్ల మాత్రమే జరుగుతుంది.” అని చెప్పారు ఐన్‌స్టీన్ గారు. “నీతిలేని వాడు కోతి కంటే పాడు” అని సామెత. నీతి నైతికత లేని జాతికి మనుగడ లేదు. కాన విద్యనార్జించే

సమయంలోనే నైతికవిలువలు విద్యార్థులకు అందించాలి. నిజజీవితానికి ఆపాదించుకొను ఉదాహరణలు ఇవ్వాలి. అప్పుడే జీవితాలకు సార్థకత. సమాజంలో శాంతి భద్రతలు పెరుగుతాయి, కలుగుతాయి. విద్యార్థులు విధేయత గలవారు కావాలి. "విధేయత" అనే ఆయుధంతో, "విశ్వసనీయత"తో కూడిన విలువలతో, "వినయమనే" కిరీటాన్ని శిరస్సు నుంచి, "విలువలు" అనే సింహాసం మీద, 'విశ్వవిజేత"గా నిన్ను కూర్చోబెట్ట గలిగేది విద్య అట్టి విద్యను సొంతచేయగలవారు ఉపాధ్యాయులు. వారే టీచర్లు.

T = Teaching, బోధన

E = English, ఆంగ్లం,

A = Algebra, బీజగణితం,

C = Chemistry, రసాయన శాస్త్రం

H = History, చరిత్ర,,

E = Environment, పర్యావరణ శాస్త్రం,

R = Rhetoric, వాక్చాతుర్యం.

ఉపాధ్యాయులు, తమ వాక్చాతుర్యంతో వివిధ అంశాలగు ఆంగ్లం, బీజగణితం, రసాయన శాస్త్రం, చరిత్ర పర్యావరణ శాస్త్రాలను బోధించుటతో పాటు, జాతి నిర్మాణానికి బాటలు వేయాలి.

జాతి నిర్మాణంలో నాలుగు అంశాలు ప్రధాన భూమికను పోషిస్తాయి. అవి సామాజిక, ఆర్థిక, రాజకీయ, పౌర సంబంధిత అంశాలు, రాజ్యాంగ సూత్రాలను అనుసరించి, సమాజిక సేవచేయుటకు సహాయకారులగు పౌరులను తయారు చేయాలి. హక్కులు బాధ్యతలు నిర్వర్తించు పౌరులు దేశభవిష్యత్తుకు అత్యవసరం. ధనవంతులు, నిరుపేదలు అను విభేదాలు తొలగిపోవుటకు, ఆర్థిక సమానతకు బాటలు వేయ పౌరులు ఎలా ఉండాలో ఊహించుకొని రాబోవు సమాజానికి సరియగు, అవసరమగు పౌరులను తయారుచేయాలి. కలుషితం కాని పరిపాలనకు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుటకు, వారిని సన్నద్ధులను చేయాలి. మారుతున్న కాలంలో ప్రపంచం ఒక గ్లోబల్ విలేజ్‌గా మారుచున్న సమయాన టెక్నాలజీని ఎలా వినియోగించుకోవాలి. శాంతి భద్రతలను ఎలా కాపాడాలి. పర్యావరణాన్ని ఎలా కాపాడాలి. ప్రపంచ శాంతికి మార్గదర్శులు ఎలా కావాలో ఉపాధ్యాయులే తమ వద్ద విద్యనభ్యసించు విద్యార్థులకు బోధించాలి. తాము జీవిస్తూ, ఇతరులను ప్రశాంతంగా జీవించు విధంగా ఉండే పౌరులను , ప్రపంచ పౌరులను తయారుచేయాలి. ఇది అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న అంశం. నాయకత్వ లక్షణాలు పుణికిపుచ్చుకోవాలి. అవసరమైన ప్రజాసేవకు,దేశసేవకు అంకితం కావాలి. అట్టి పౌరులను తయారుచేయుటకు ఉపాధ్యాయులు రచనలు చేయాలి.

"విద్యావివాదాయ, ధనం మదాయ,

శక్తిః పరేషాం పరపీడనాయ

ఖలస్య నాథోః విపరీతమే తత్

జ్ఞానాయ దానాయచ రక్షణాయ" అని పెద్దలు చెప్పే ఒక శ్లోకం. ఒక చెడ్డవానివద్ద గల విద్య వివాదాలకు, ధనం మదానికి, శక్తి ఇతరులను పీడించుటకు ఉపయోగ పడగా, అది మంచి వారి వద్దకు చేరితే, విద్య ఇతరులకు బోధించడానికి, ధనం దానంచేయడానికి, శక్తి బలహీనులను రక్షించడానికి ఉపయోగపడుతుంది. మంచి వారిని, మంచికి విద్యను ఉపయోగించు పౌరులను తయారు చేయవలసిన బాధ్యత టీచర్లపై ఉంది.

శీలసంపద గలిగిన విద్యార్థులను ఉత్తమపౌరులుగా చేయాలి. కారణం "శీలమును మించిన సిరిసంపదలు లేవు. శీలమును జయించు క్షిపణి లేదు. నరుని శీలమొకటి నర శేఖరుని చేయు." అని చెబుతారు. ఏదేశము

గొప్పదేశము అవుతుంది అనగా ఒకదేశము దాని యందు గల బంగారము, వెండి, సంపదల వల్ల కాదు. ఆ దేశములోని ప్రజల వల్ల మాత్రమే అని ఎమర్సన్ అను ఆంగ్లేయ కవి గారు చెబుతారు.

N = NATURAL RESOURCESప్రాకృతిక వనరులు (మానవులు కూడా దేశానికి వనరులే. వారినే మానవ వనరులు అంటారు)

A = ATTITUDE వినియోగించు విధానము

T = TECHNOLOGY సాంకేతికత

I = IDEALOGY ఆలోచనా విధానం

O=OPPORTUNITIES అవకాశములు

N = N EW ERA నవయుగం

BUILDER = నిర్మాత

దేశములో గల ప్రకృతి వనరులను (మానవులను) సరిగా వినియోగిస్తూ, సరియగు విదానమును అనుసరిస్తూ, సాంకేతిక రంగమున వచ్చు మార్పులను గమనిస్తూ, మారుతున్న కాలమునకు అవసరమగు ఆలోచనలు చేస్తూ, నవయుగాన్ని సృష్టించుటయే జాతి నిర్మాత యగు ఒక టీచర్ యొక్క విధి అని మనము అర్థము చేసుకోవచ్చు. వారే నవయుగ నిర్మాతలు. నవయుగ వైతాళికులు అని ప్రగాఢంగా విశ్వశిద్దాము.

ఒక ఇంటిలో ఒక తల్లి తన బిడ్డలను మాత్రమే మంచి వారిగా తయారు చేయగలదు. కానీ ఒక టీచర్ తన తరగతి గదిలోని విద్యార్థులందరినీ మంచి పౌరులుగా మార్చగలరు. దేశాన్ని ఆధునిక సమాజ అవసరాలకు అనుగుణంగా మార్చి దేశభవితకు సహాయకారులు కాగలరు. ఇదే వారు చేసే దేశసేవ.

గురువు తన శిష్యుని తనంతవానిని లేదా తన కన్నా గొప్ప వానిని చేయగలడు. లాలనలో తల్లిలా, పాలనలో తండ్రిలా, బోధనలతో గురువులా అజ్ఞానాన్ని తొలగించి, విజ్ఞానాన్ని అందించి నవసమాజమునకు అందించగలడు. ఏది సత్యమో? ఏది అసత్యమో! దేనిని నమ్మాలో దేనిని నమ్మరాదో; తెలియజెబుతూ, తాను చేయు పని అందరికీ యోగ్యమైనదని అనిపిస్తుందా లేదా ? అని విచక్షణను ఉపయోగిస్తూ, ఇది అందరిలో శాంతి సామరస్యాలను స్నేహతత్వాన్ని తీసుకురాగలదా! అని ఆలోచిస్తూ, స్థానికంగా, ప్రాపంచికంగా మంచిని చేకూర్చగలదా అని హేతుబద్ధంగా ఆలోచింపజేస్తూ ప్రగతికి బాటలు వేయుట భావి భారత నిర్మణంలో టీచర్ యొక్క బాధ్యతయై యున్నది.

ఒక టీచర్ విద్యార్థుల బంగారు భవిష్యత్కు బాటలు వేసి, వారిని సన్మార్గంలో నడిపించే డ్రైవరుగా, విద్యార్థిమానసిక ఉన్నతికి పాటుబడే వైద్యునిగా, విద్యార్థికి పరిస్థితులను క్షుణ్ణంగా విడమరిచి చెప్పే సైంటిస్టుగా, విద్యార్థికి నిర్మాణాత్మక శక్తిని ఇచ్చే బిల్డింగ్ కాంట్రాక్టరుగా, ఇంకా సంఘంలో యున్న ప్రతి వృత్తి నైపుణ్యాన్ని తనలో ఇముడ్చుకొని, తానే అన్ని వృత్తులను నిర్వహించేవాడు, అన్ని వృత్తులవారిని తయారుచేయగలవాడు, అన్ని వృత్తులకు విలువగలదని చెప్పే ఉపాధ్యాయుడే భావి భారత జాతి నిర్మాత.